క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బదిలీపై వచ్చిన రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతవరకూ పనిచేసిన ఎస్సై కె. నీలకంఠానికి కొమరాడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయింది. ఇంతవరకు గరుగుబిల్లి ఎస్సైగా పనిచేసిన రాజేష్ సీతానగరం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శాంతి భద్రతలపై సిబ్బందితో చర్చించారు.

75 మద్యంసీసాల పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలు

బలిజిపేట: మండలంలోని పదమాయవలస నుంచి పి.చాకరాపల్లి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 75మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్‌కుమార్ సోమవారం తెలిపారు. పదమాయవలస గ్రామానికి చెందిన ఎస్.కృష్ణ పి.చాకరాపల్లి గ్రామం వైపు మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా సువర్ణముఖి నది వద్ద వాటిని పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన సతీమణి చిన్నమ్మలుతో కలిసి దైవదర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామ కూడలి వద్ద కొత్తగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన బేరి గణపతి తన తండ్రి సంగంనాయుడు జ్ఞాపకార్థం రూ.2.5 లక్షల వ్యయంతో ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించగా, ఆయనను ఎమ్మెల్యే పిలిచి మరీ అభినందించారు. గ్రామాభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా యువత ప్రజాసేవకు ముందుకు వస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, సర్పంచ్ బేరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శంకరరావు తదితరులు

రాజాం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు ప్రజలను కోరారు. వికసిత్ భారత్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆగూరు, డీఆర్‌ఎస్ వలస గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు

నేడు బడ్జెట్ సమావేశం

బాడంగి: మండల పరిషత్ బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

పోటెత్తిన శివాలయాలు

సీతానగరం: కార్తీమాసోత్సవం సందర్భంగా రెండవ సోమవారం వేకువ జామునుంచే భక్తుల రాకతో శివాలయాలు పోటెత్తాయి. కార్తీక దామోదరుడికి ప్రీతికరమైన సోమవారం కావడం వల్ల సీతానగరం మండలంలోని కాశీపేట, సీతానగరం, నిడగల్లు బూర్జ, లచ్చయ్యపేట, మరిపివలస, గుచ్చిమి గ్రామాల్లోని ఆలయాల్లో వేలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలో వరిచేను కోతపనులు ముమ్మరంగా ఉన్నప్పటికీ భక్తులు ఉదయాన్నే సువర్ణముఖి నదిలో స్నానాలు చేసి శివాలయంల్లో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే లచ్చయ్యపేట, నిడగల్లు నీలకంఠేశ్వరస్వామి, మరిపివలస, గుచ్చిమి శివాలయాల్లో భక్తులు శివ పూజలకు భారీఎత్తున క్యూ కట్టారు. భక్తులతో ఆలయ అర్చకులు అభిషేకాలు, పూజలు చేయించారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలోని నారాయణపురం, గలావల్లి, గంగాడ, చిలకలపల్లి, బలిజిపేట, వెంగాపురం, మిర్తివలస, బర్లి, అరసాడ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా నారాయణపురం నీలకంఠేశ్వరస్వామి, గలావల్లి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివాభిషేకాలు చేశారు.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురం: మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, వెంకంపేట, ములగ, చినబొండపల్లి, పెదబొండపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు శివుణ్ని దర్శించుకునేందుకు ఉదయం నుంచే ఆలయాల ముందు క్యూ కట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి నిత్య



సీతానగరం: పంచముఖేశ్వరాలయంలో వేకువ జామునుంచి క్యూలో ఉన్న భక్తులు

పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అలాగే ఉసిరి చెట్టుకింద పూజలు చేసి అర్చకులకు దీపాలు, సాలగ్రామ దానాలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆయా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు..

సాలూరు: పట్టణం, మండల పరిధిలోని శివాలయాల్లో శివనామ స్మరణ మార్మోగింది. పట్టణంలోని పంచముఖేశ్వరస్వామి, కామాక్షమ్మ ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాలతో పాటు మండలంలోని తోణాం, శివరాంపురం, మామిడిపల్లి, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల ముందు భక్తులు బారులు తీరారు. పట్టణంలోని దండిగాం రోడ్డు సమీపంలో గల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి పీడిక రాజన్నదొర, రోజమ్మ దంపతులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణం, మండలాల్లో అయ్యప్పస్వాములు పాలకావిళ్లతో తిరువీధులు నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప భక్తుల తిరువీధి

పాచిపెంట: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో అయ్యప్ప భక్తులు పాలకావిడలతో సోమవారం తిరువీధి నిర్వహించారు. గణపతి, సంతోష్ గురుస్వాముల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నుంచి శివాలయం వరకు సాగిన తిరువీధిలో భక్తులు అయ్యప్ప, శివనామస్మరణలతో హోరెత్తించారు. అనంతరం స్థానిక శివాలయంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామికి అభిషేకం చేసి పాలను భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు



సాలూరు: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: పట్టణంలో అయ్యప్ప భక్తుల తిరువీధి



గలావల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాచిపెంట: పాల కావిళ్లతో అయ్యప్ప భక్తులు



పార్వతీపురం: సంగంవలసలో కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

చెందిన అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో అఖండ అన్నసమారాధన

మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ కమిటీ సభ్యులు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని, ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కాలువలు, సీసీ రోడ్లకు భూమిపూజ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు.

- రూ.20 లక్షలతో పెదభోగిలిలో అభివృద్ధి

సీతానగరం: మండలంలోని పెదభోగిలి హౌసింగ్, హడ్కో కాలనీల్లో ప్రజల కోరిక మేరకు సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రెండు కాలనీలకు అనుసంధానంగా ఉన్న కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అభివృద్ధి పనులు చేపట్టడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో గడప గడపకు వచ్చిన సమయంలో కాలువలు, రోడ్డు సౌకర్యం లేదని, ఇళ్లస్థలాలు ఇవ్వాలని ప్రజలనుంచి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కాలనీల్లో రూ 20 లక్షలతో మంజూరు చేసిన పనులను వేగవంతం చేయాలని నిర్వాహకులను కోరారు.

మహిళలకు చీరల పంపిణీ

అనంతరం ఎమ్మెల్యే తన సొంత నిధులతో 250 మంది మహిళలకు ఒక చీర, రూ 500లు వంతున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిరంతరం శ్రమించడంతో పాటు ప్రజా సంక్షేమ పథకాల అమలుకు చేస్తున్న కృషిని మనందరం గుర్తించాలని కోరారు. అలాగే తనవంతుగా ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో తన జీతం ప్రజలకోసమే వెచ్చిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ జె తేరేజమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్.రమేష్, పి.సతీష్‌కుమార్, లక్ష్మణరావు, బి.ముకుంద రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సీహెచ్ కృష్ణ, బి.శ్రీనివాసరావు, కె.రాధ, ఎంపీటీసీలు ఎస్.గౌరి, వై అరుణకుమారి, శంకరరావు, ఆర్వీ పార్థసారథి, రాధాకృష్ణ, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్వో కుమారస్వామి. కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో పంట దిగుబడి వివరాలు



ఆగూరులో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

రాజాం: పంటకోత ప్రయోగాలతో పంట దిగుబడి వివరాలు తెలుస్తాయని ఏవో ఎ.రేణుకాసాయి అన్నారు. మండలంలోని ఆగూరులో ముగ్గురు రైతులకు చెందిన పంటపొలాల్లో పంటకోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణంలోని పంటపొలంలో ప్రయోగం చేపట్టగా, ఎకరాకు 27 బస్తాల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు ఓ అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగానే ఉన్నట్లు ఆయన తెలిపారు.

108 సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన 108 సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందికి రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మేనేజర్ నాజిర్ హుస్సేన్ శిక్షణ అంశాలను వివరించారు. కొత్తగా వస్తున్న మార్పులు, సమాచార వ్యవస్థతో పాటు గుండె జబ్బుతో బాధపడే వారి పట్ల, ప్రసవ సమయంలో గర్భిణుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి డివిజన్ వోకులు ఉపేంద్ర, సాయిషణ్ముఖ్, ఓజీటి ఎ.శ్రీనివాసరావు, ఈఎంటీలు పాల్గొన్నారు.

చోడిసాగుపై దృష్టిసారించాలి

రేగిడి: చోడిసాగుపై రైతులు దృష్టిసారించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పోరాం, కాగితాపల్లి, ఉనుకూరు, సరసనాపల్లి గ్రామాల్లోని రైతులకు చోడి పంట సాగు చేసే విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ పంటను సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుందన్నారు. ఉడుపు, లైన్ షోయింగ్ ద్వారా మాత్రమే విత్తనాలు నాటుకోవాలని తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మట్టి నమూనాలు

సీతానగరం: మండలకేంద్రంలోని సుంకరి వీధిలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, భవననిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం భూమి పూజ చేయనున్నారని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి తెలిపారు. కమ్యూనిటీ భవనం నిర్మాణం చేయాల్సిన భూమిలో ఇంజినీరింగ్ సహాయకులు, నిర్వాహకు లతో కలిసి సోమవారం ఆయన స్థల పరిశీలన చేసి కాలమ్స్ తీసేందుకు కొలతలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలన్న సుంకరివీధి పెద్దల కోరిక మేరకు ముందుగా రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్, నిర్వాహకులు అప్పారావు, పైడిపి నాయుడు, రామారావు, సింహాచలం శ్రీనివాసరావు, బంగారినాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ భవనం స్థలంలో మార్కింగ్ ఇస్తున్న అధికారులు

ఎన్‌ఆర్‌సీని సందర్శించిన డీఐఓ

పార్వతీపురంటౌన్: పోషకాహార పునరావాస కేంద్రా(ఎన్‌ఆర్‌సీ)న్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్. టి.జగన్‌మోహన్‌రావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో ఉన్న ఎన్‌ఆర్‌సీలో వివిధ ప్రాంతాల నుంచి చేరిన ఐదేళ్లలోపు పిల్లలను, వారి ఆరోగ్య వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. పిల్లల బరువు స్వయంగా పరిశీలించి ఎదుగుదల లోపం, రక్తహీనత, పోషకాహారలోపం వంటి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అన్న విషయాలను తనిఖీ చేశారు. గతంలో ఆస్పత్రిలో చేరిన పిల్లల ఆరోగ్యం ఏమేరకు మెరుగైందో తెలుసుకున్నారు. పిల్లలను తరచూ పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బరువు, ఎదుగుదల తక్కువగా గుర్తించిన పిల్లలను పూర్తి ఆరోగ్య వివరాలతో ఎన్‌ఆర్‌సీ కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి, న్యూట్రిషన్ కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఆర్‌సీలో చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలిస్తున్న డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

అలరించిన సంగీత కచేరి

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం చేపట్టిన సంగీత కచేరి ప్రేక్షకులను అలరించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, భారత నాటక అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కచేరీలో ప్రముఖ కళాకారులు భమిడిపాటి కనకదుర్గాప్రసాద్ చేసిన వీణవాయిద్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. కళలకు పుట్టినిల్లు అయిన బొబ్బిలిలో ఈ తరహా కార్యక్రమం చాలారోజుల తర్వాత జరగడంతో చూసి, ఆనందించేందుకు ప్రజలు ఉవ్విళ్లూరారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, కళాకారులకు సన్మానించారు.



ఆకట్టుకున్న వీణవాయిద్య ప్రదర్శన

30న మానవతా సేవా సంస్థ ఏర్పాటు

రాజాం సిటీ: సమాజ సేవే లక్ష్యంగా ఈ నెల 30వ తేదీన స్థానిక పట్టణంలో మానవతా సేవా సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక పట్టణంలో సంస్థ వివరాలు, లక్ష్యాలు తెలిపే కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నైతిక విలువల బోధన, ఉచిత వైద్యశిబిరాలు వంటివి నిర్వహించనున్నామన్నారు.

శీతాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

రామభద్రపురం: శీతాకాలంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏఎల్‌జి శిరీష, అపర్ణ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ శీతలగాలులతో పాటు తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మంచు కురుస్తుండంతో ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారు కూడా మంచులో ఎక్కువగా తిరగవద్దన్నారు. నెలల బిడ్డలు తల్లి పొత్తిలిలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడాదిలోపు పిల్లలకు చలిగాలి తగలకుండా చూసుకోవాలన్నారు. చలి వల్ల ఫిట్స్ కూడా వచ్చే ప్రమాదముందన్నారు. ప్రయాణాలలో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలన్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు మఫ్లర్, స్వెట్టర్‌తో పాటు షూ వేసుకోవాలని, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. వాతావరణ మార్పు ల కారణంగా వైరల్ జ్వరాలు, గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నాయని, తగిన జాగ్రత్తలు పా టించాలని తెలిపారు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శిరీష, అపర్ణ

దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రండి..

- టీడీపీ నాయకులకు సవాల్ విసిరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సాకారమవుతుంటే టీడీపీ నాయకులు తట్టుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గొర్లె జగన్ మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, తదితరులు మండిపడ్డారు. పట్టణంలోని టిడ్కో ఇళ్ల గృహ సముదాయాల వద్ద సోమవారం వారు మాట్లాడుతూ... టీడీపీ నాయకులు గుమ్మడి సంధ్యారాణి, భంజ్‌దేవ్, తదితరులు చంద్రపువలస టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కట్టించిన ఈ టిడ్కో ఇళ్లను తామే కట్టించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఎంతో దూరదృష్టితో పేద ప్రజల కోసం సుమారు 14 ఎకరాలు సేకరించడం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగనన్న పాలనలో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేవలం ఒక్క రుపాయికే ప్రజల సొంతింటి కలను జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని వివరించారు. శంకుస్థాపనలకు కొబ్బరికాయలు కొట్టడం అభివృద్ధి కాదని.. వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని మేము ప్రజలకు ధైర్యంగా ప్రజలకు చెప్పగలమని.. మీరు మీ హయాంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయగలరా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పప్పల లక్ష్మణరావు, గొర్లె వెంకటరమణ, నాగ వరప్రసాదరావు, సింహాచలం, బద్రి, పిరిడి రామకృష్ణ, తాడ్డి రమణ, పున్నాన మోహన్, హరిబాలాజీ, శేషు, తదితరులు పాల్గొన్నారు.